కథ

## యస్వీకృష్ణ

# మనసుకి మరోవైపు

మైకులోంచి అనౌన్సర్ గొంతు వినిపించిందో లేదో అప్పటివరకూ ప్లాట్‌ఫారంపై నిల్చున్న వాళ్ళలో ఒక్కసారిగా కలకలం మొదలైంది. రైల్లో కూర్చున్న తమ వాళ్ళతో కిటికీల్లోంచి చివరగా మాట్లాడాల్సిన విషయాలేవో గబగబా మాట్లాడేస్తూ వీడ్కోలు చెప్పే ప్రయత్నంలో ఉన్నారు.

"జాగ్రత్తగా వెళ్ళండి నాన్నా! వైజాగ్ చేరుకోగానే ఫోన్ చేయడం మర్చిపోవద్దు"

తనకి జాగ్రత్తలు చెబుతున్న కొడుకు మాటలు వింటూంటే ముచ్చటేసింది ఆనందరావుకి.

"తాతయ్యా..తాతయ్యా! మాకింక రెండే రెండు ఎగ్జామ్స్ మిగిలాయి. ఆ తర్వాత మా స్కూలుకి కూడా హాలిడేస్ ఇస్తారు. నువ్వు ఓ రెండ్రోజులు ఆగివుంటే అందరం కలిసి వైజాగ్ వెళ్లేవాళ్లం కదా తాతయ్యా!" బుంగమూతి పెట్టుకుని నిష్టూరంగా అంది ఎనిమిదేళ్ల మనవరాలు.

"చెప్పాను కదమ్మా..నాకు ఈరోజు వరకే లీవుంది. రేపు తప్పనిసరిగా ఆఫీసుకి అటెండవ్వాలి. అయినా ఈ రెండ్రోజులూ నాన్నమ్మ మీతోనే ఉంటుందిగా! నీ ఎగ్జామ్స్ అయిపోగానే నువ్వూ, తమ్ముడూ నాన్నమ్మతో కలిసి వైజాగ్ వచ్చేస్తారుగా. మీకోసం నేను వైజాగ్‌లో ఎదురుచూస్తూ ఉంటానేం!" ఆప్యాయంగా అన్నాడు మనవరాలితో.

ఐదేళ్ల మనవడైతే తనమీద అలిగినట్లున్నాడు. వాళ్ళ నాన్నమ్మ వెనకాల నక్కి నిలబడి తనవంకే గుర్రుగా చూస్తున్నాడు.

"ఏమోయ్..హీరో! నాతో మాట్లాడవా?"

"నువ్వుండకుండా వెళ్లిపోతున్నావుగా. నీతో మాట్లాడను పో!" పౌరుషంగా అంటున్న మనవడు భలే ముద్దొచ్చాడు ఆనందరావుకి.

రైలు కూత పెట్టింది.

"ఏమండీ..జాగ్రత్త! ఇబ్బందైనా ఈ రెండ్రోజులూ ఎలాగోలా సర్దుకోండి. పరీక్షలైపోగానే పిల్లల్ని తీసుకు వైజాగ్ వచ్చేస్తాను"

"ఫర్వాలేదు లక్ష్మీ! రెండ్రోజులేగా..ఎలాగోలా అడ్జస్ట్ అవుతాలే..నువ్వేం కంగారుపడకు!" అన్నాడు.

చిన్న కుదుపుతో రైలు కదిలింది.

"క్షేమంగా వెళ్లండి మావయ్యగారూ!"

"అలాగేనమ్మా!" కోడలికి నవ్వుతూ బదులిచ్చాడు ఆనందరావు.

సెండాఫ్ ఇవ్వడానికి వచ్చినవారు రైలుతోపాటే అడుగులు వేస్తూ లోపలవున్న తమ బంధువులకి చివరిగా వీడ్కోలు పలుకుతున్నారు. ప్లాట్‌ఫారంపై నిల్చుని తనకి 'టాటా' చెప్తున్నట్లుగా చేతులూపుతున్న భార్య, కొడుకూ, కోడలూ, మనవలను చూస్తూ బదులుగా కిటికీలోంచి తనూ చేయి ఊపుతూండగా...రైలు క్రమంగా వేగాన్ని పుంజుకొని, ప్లాట్‌ఫారాన్ని విడిచిపెట్టింది. తన వాళ్ళు కనుమరుగయ్యేదాకా కిటికీలోంచి చూస్తూ..ఆ తర్వాత సీట్లో సరిగ్గా సర్దుకుని కూర్చున్నాడు ఆనందరావు.

ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో డబుల్ బెర్త్ 'కూపే' అది! రెండో బెర్త్ ఖాళీగా వుంది. బహుశా సికిందరాబాద్ స్టేషన్ నుండి ఆ బెర్త్ రిజర్వ్ అయివుంటుంది. ప్రస్తుతానికి కూపేలో తానొక్కడే ఉన్నాడు. తన గురించీ, తన కుటుంబం గురించీ తలచుకున్నప్పుడల్లా తృప్తిగా, గర్వంగా ఉంటుందతడికెప్పుడూ. కాళ్ళు ముందుకి చాపి తల వెనక్కి వాల్చి నెమ్మదిగా కళ్ళు మూసుకున్నాడు.

ఒంటరిగా ఉండే సమయాల్లో తరచూ అతని మనసంతా కమ్ముకుని, ఆలోచనల్ని ఆక్రమించుకునే ముప్పైయ్యేళ్ళ క్రిందటి ఓ మధురమైన జ్ఞాపకం అతడ్ని మళ్లీ చుట్టుముట్టేసింది.

○○○

"ఎక్స్‌క్యూజ్ మీ"

ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు ఆనందరావు. కంగారుగా కిటికీలోంచి బయటికి చూశాడు. తానున్న రైలు సికిందరాబాద్ స్టేషన్ నుంచి నెమ్మదిగా కదులుతోంది.

"ఎక్స్‌క్యూజ్‌మీ సర్! విల్ యూ ప్లీజ్" అన్న గొంతు విని, తల తిప్పి చూశాడు.

తన ప్రక్కనే లగేజితో ఓ యువకుడు నిలబడి ఉండడం గమనించి, "ఓ..సారీ!" అంటూ అడ్డుగా ఉన్న తన కాళ్లు వెనక్కి లాక్కుని, సీట్లో సరిగ్గా సర్దుకుని కూర్చున్నాడు ఆనందరావు.

ఆ యువకుడు వెంటనే తన చేతిలోని లగేజిని బెర్తుపై సర్ది, "అమ్మా..రా! ఇదే నీ సీటు! ట్రైన్ కదుల్తోంది. నేను దిగిపోతున్నాను..జాగ్రత్తగా వెళ్లిరా...వెళ్లగానే ఫోన్ చేయి..సరేనా?" అంటూ సమాధానం కోసం కూడా ఆకుండా వెనక్కి తిరిగి గబగబా రైలు దిగిపోయాడు.

అప్పటిదాకా అతడి వెనుక నిలబడివున్న ఆవిడ నెమ్మదిగా వచ్చి ఆనందరావు ఎదురుగా ఉన్న తన సీట్లో కూర్చుంది.

జేబులోని కళ్ళజోడు తీసి పెట్టుకుంటూ ఆమె వంక ఆసక్తిగా చూశాడు ఆనందరావు.

దాదాపు యాభయ్యా, యాభయ్యయిదేళ్ల వయసుంటుందేమో ఆవిడకి! మనిషి ఖరీదైన చీరలో నిండుగా ఉంది. తల వంచుకుని చేతిలోని హ్యాండ్‌బ్యాగ్ లోంచి-టికెట్ కాబోలు ఒకసారి బయటకి తీసి సరిచూసుకుని మళ్లీ లోపల పెట్టేసింది. ఆ తర్వాత కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటూ తల పైకెత్తింది.

అంతే...యథాలాపంగా ఆమె ముఖం వంక చూసిన ఆనందరావు ఒక్కసారిగా నిర్ఘాంతపోయాడు. మనసులో ఏదో అలజడి కెరటంలా ఎగిసిపడింది. నమ్మలేనట్లుగా ఆమె ముఖంలోకి పరీక్షగా చూశాడు.

నుదుట గుండ్రటి బొట్టు, ముడివేసుకున్న నెరిసిన జుట్టు, ఖరీదైన చీరకట్టులో ఆమె కొంచెం తేడాగా కనిపిస్తున్నా-ముఖంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తున్న పోలికలు మాత్రం అతడి చూపుల్ని కట్టిపడేశాయి.

అతడు తనవంకే కళ్ళప్పగించి చూడడాన్ని గమనించిందేమో..ఇబ్బందిగా కదిలిందామె.

కానీ అదేదీ గమనించే స్థితిలో లేడతడు. ముప్ఫయ్యేళ్లుగా మనసుని అంటిపెట్టుకుని, తరచూ తనని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఓ చక్కటి జ్ఞాపకం ముప్పిరిగొన్నట్లుగా ఇలా కళ్లముందు ఒక్కసారిగా ప్రత్యక్షమయ్యేసరికి-'అవునా కాదా?', 'నిజమా, అబద్ధమా?' అన్న సందిగ్ధంలో ఎటూ తేల్చుకోలేక పోతున్నాడతడు. ఆశ్చర్యం, అపనమ్మకం మనసుని సతమతపెడ్తోంటే..కాసేపటికి తేరుకొని-

"నువ్వూ..నువ్వూ..మీరు..మీ పేరు కస్తూరి కదూ?" అన్నాడు గొంతు పెగల్చుకొని.


ఈసారి ఆశ్చర్యపోవడం ఆమె వంతయింది. "అవునూ..మీరు..?" ప్రశ్నార్థకంగా చూసిందతడి వంక.

అంతే..గబుక్కున కళ్ళజోడు తీసి "కస్తూరీ..నేను..నేను ఆనంద్‌ని! గుర్తుపట్టలేదా?" అన్నాడు.

ఆమె బ్యాగ్‌లోంచి కళ్ళజోడు తీసి పెట్టుకొని కొన్నిక్షణాలు అతడి ముఖంలోకి గుచ్చి గుచ్చి చూసి "ఓహ్..ఆనంద్ నువ్వా? నిజంగా నువ్వేనా? ఎంత మారిపోయావ్? అదేంటీ అప్పుడే ముసలాడివైయావ్?" అంది తనూ ఆశ్చర్యానందాలతో.

"బావుంది. అక్కడికి నువ్వేదో పాతికేళ్ల పడుచు

ఆంధ్రభూమి దినపత్రిక ఉగాది కథలపోటీలో ఎంపికైన రచన



లాగే ఉన్నట్టు? అసలు నేను నమ్మలేకపోతున్నాననుకో..ఇంకా ఇది కలా, నిజమా? అని అనిపిస్తోంది కస్తూరీ!"

''నా కూ్క డా''

అందామె.

"ఈ జన్మలో మళ్లీ నువ్వు నాకు కన్పిస్తావనుకోలేదు కస్తూరీ! ఇన్నాళ్లూ ఎక్కడున్నావ్? ఎలా ఉన్నావ్? ఏం చేస్తున్నావ్?" ప్రశ్నల వర్షం కురిపించసాగాడు.

"నా గురించి సర్లే! ముందు నీ సంగతి చెప్పు..నువ్వెలా ఉన్నావ్? ఏం చేస్తున్నావ్?" ఆసక్తిగా అడిగిన ఆమె వంకే చూస్తూ "నేనూ.." అంటూ చెప్పసాగాడు ఆనందరావు.

అలా ఒకరి గురించి మరొకరు తెలుసుకుంటూండగా..అప్పుడే అవతలి పట్టాలపై మరేదో రైలు చెవులు చిల్లులు పడేలా శబ్దం చేస్తూ వీళ్ళున్న రైలుని దాటిపోసాగింది.

ooo

"అయితే..మంచి భర్త, చక్కగా సెటిలైన పిల్లల్తో జీవితాన్ని హాయిగా గడిపేస్తున్నావన్నమాట! ఇంతకీ వైజాగ్ ఎందుకొస్తున్నావ్ కస్తూరీ? పైగా..ఒంటరిగా?"

"మా రెండోవాడు ఉద్యోగరీత్యా వైజాగ్‌లో సెటిలయ్యాడు. ఎల్లుండి వాడి కూతురి బారసాల! మావారేమో బిజినెస్ పనిమీద ఢిల్లీ వెళ్లారు. ఆయన లేకపోతే బిజినెస్ వ్యవహారాలన్నీ మా పెద్దబ్బాయే చూసుకోవాలి. మనవలకేమో ఎగ్జామ్సవుతున్నాయి. అందుకే ఒక్కదాన్నే బయల్దేరాల్సి వచ్చింది"

'ఓహో' అన్నట్లుగా తల పంకించాడు ఆనందరావు.

"అద్సరే ఆనంద్..వైజాగ్‌లో సెటిలయ్యానావ్-మరి, సికిందరాబాద్ నుంచి బయల్దేరావేంటీ? నువ్వు కూడా ఒంటరిగా?" నవ్వుతూ అడిగింది.

నవ్వుతూనే బదులిచ్చాడు ఆనందరావు- "మా పెద్దబ్బాయికి హైదరాబాద్‌లో ఉద్యోగం. ఇన్నాళ్లకి వాడో ఇంటివాడయ్యాడు. ఐ మీన్..స్వంత ఇల్లు కట్టుకున్నాడు. ఆ గృహప్రవేశానికి నేనూ, మా ఆవిడా వైజాగ్ నుంచి వచ్చాం. ఇంకో రెండ్రోజుల్లో మనవల ఎగ్జామ్స్ పూర్తవుతాయి. ఎగ్జామ్సవ్వగానే మనవల్ని తీసుకుని వస్తానని మా ఆవిడ హైదరాబాద్‌లోనే ఉండిపోయింది. నాకేమో ఈరోజు వరకే లీవుంది. రేపు ఆఫీసుకి అటెండవ్వాలి. అందుకే ఒక్కణ్ణే బయల్దేరక తప్పలేదు"

"అవునూ..నీకింకా ఎన్నేళ్ల సర్వీసుంది ఆనంద్? ఐ మీన్..నీ రిటైర్మెంట్‌కి ఇంకా ఎంత టైముంది?"

"దాదాపు రెండున్నర సంవత్సరాలు!"

ఆమె ఏమీ మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తూ ఉండిపోయింది. బహుశా..అతడు చెప్పిన సమాధానాన్ని బట్టి

అతడి వయసుని లెక్కిస్తూ ఉండిపోయిందేమో!

ఇంకేం మాట్లాడాలో తెలీనట్లు అతడూ మౌనంగా ఉండిపోయాడు.

కానీ అతడి మనసు మాత్రం ఆనందంతో ఉద్వేగంతో ఉరకలు వేస్తోంది. ముప్ఫయ్యేళ్ల క్రితం విజయవాడ కాలేజీలో చదువుకునే రోజుల్లో తను ప్రాణాతిప్రాణంగా ప్రేమించి, పెళ్లి కూడా చేసుకోవాలనుకున్న కస్తూరి - జీవితంలో మళ్లీ తనకు కనిపిస్తుందని ఊహించని కస్తూరి- తరచూ తన మనసునంతా ఆక్రమించుకుని తన జ్ఞాపకాలతో పాతరోజుల్ని ఎప్పటికప్పుడు తన కళ్ళ ముందుంచే కస్తూరి - ఇన్నేళ్ల తర్వాత మళ్లీ ఇలా తారసపడడమే కాక ఇలా ఫస్ట్‌క్లాస్ కూపేలో ఆమెతో ఏకాంతంగా గడిపే అవకాశం కలిగేసరికి 'ఇది కల కాదు..నిజమే!'నని ఇంకా నమ్మలేని మానసిక స్థితిలో ఉన్నాడతను.

కస్తూరి కిటికీలోంచి బయటకి చూస్తోంది.

అటూ ఇటూ కదులుతున్న ముంగురుల్ని సుతారంగా వెనక్కి నెడుతోంది కస్తూరి. అలా ఆమెని చూస్తోంటే ఎంతో అపురూపంగా ఉంది ఆనందరావుకి.

'మెరుపుతీగలా కనిపిస్తూ, చలాకీగా గలగలా మాట్లాడే ఒకప్పటి కస్తూరేనా?' అనుకున్నాడు. నెరిసిన జుట్టు, గుండ్రని బొట్టు, గోల్డ్‌ఫ్రేమ్ కళ్ళజోడు, వడలిన చర్మం ఆమెలో వృద్ధాప్యాన్ని సూచిస్తున్నా కొద్దిగా ఒళ్ళు చేసినట్లు కనిపిస్తున్నా..ఇవన్నీ ఆమెకి హుందాతనాన్నే ఇచ్చాయి. ఆమె ముఖంలోని భావాలను చదివేందుకు ప్రయత్నించసాగాడు.

ఆమెకసలు గతం గుర్తుందో లేదో? 'ఆనంద్! నిన్ను చూడకుండా ఒక్కక్షణమైనా ఉండలే'నని, 'నీతో జీవితం పంచుకోకుంటే నేనసలు బ్రతకలే'నని ఎన్నిసార్లు అనేదో తను! అలాంటిది- తన తోడు లేకుండానే, తనని చూడకుండానే ఏకంగా ముప్ఫయేళ్లు గడిపేసింది. ఇన్నేళ్లలో తను ఆమెకి ఎప్పుడైనా గుర్తొచ్చాడో లేదో? కానీ, ఆమె జ్ఞాపకాలు మాత్రం తనని తరచూ పలకరించేవి.

అతడి మనసులోని భావాలను చదివినట్లుగా..ఉన్నట్టుండి ఏదో గుర్తొచ్చినట్లు ఆమె తన బ్యాగ్‌లోంచి ఏదో వెతికి తీసి, అతడి ముందుకి చేయి చాచి ఇస్తూ.."తీసుకో ఆనంద్!" అంది.

"ఏంటీ..ఇన్నేళ్ల తర్వాత మనమిలా కలుసుకున్న సందర్భంలో నువ్విచ్చే స్పెషల్ ట్రీటా?" నవ్వుతూ అన్నాడు.

"అదేం కాదు. నిన్న మా మనవడి కోసం కొన్నాను. ఓ రెండు నా బ్యాగ్ లోనే మిగిలిపోయినట్లు గుర్తుంది. నీకిష్టం కదా అనీ!"

ఆమె ఇచ్చిందేమిటో చూసి ఆశ్చర్యపోయాడతడు..ఓ చాక్లెట్ అది!

కాలేజీలో చదువుకునే రోజుల్లో తరచూ తామిద్దరూ కలుసుకునే ఏకాంత ప్రదేశానికి వచ్చిన ప్రతీసారి కస్తూరి మొదటగా తన చేతిలో ఓ చాక్లెట్ పెట్టేది. అవంటే తనకెంతో ఇష్టమని! ఇన్ని సంవత్సరాల తర్వాత కలిసినప్పటికీ తన 'ఇష్టాన్ని' ఆమె ఇంకా మర్చిపోలేదన్న విషయం తెలీగానే -తనువంతా ఆర్ద్రత నింపుకున్న ఓ హిమసమీరం తన హృదయాన్ని బలంగా హత్తుకున్న పులకింత కలిగిందతడికి. మనసులోని అనుభూతి కళ్ళలో తేమగా ప్రత్యక్షమైంది.

"కస్తూరీ! ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా నేనూ, నా ఇష్టాలూ నీకింకా గుర్తున్నాయా?" అతడి గొంతు గద్గదమైంది.


గలగలా నవ్వేసిందామె. "ఎందుకులేవు? నువ్వూ, నీ ఇష్టాలే కాదు నీకు నవ్వూ, కోపాన్నీ తెప్పించే విషయాలూ, మన కాలేజీ రోజులూ, ఆ సరదా సంగతుల్చూ, స్వచ్ఛమైన స్నేహాలూ...అన్నీ గుర్తున్నాయి నాకే. అంతేకాదు ఒకర్నొకరం చూసుకోకుండా, మాట్లాడుకోకుండా ఒక్కరోజు కూడా ఉండలేని మన గాఢమైన స్నేహం, మనం దూరమైతే బ్రతకలేమనీ, మనం కలిసి బ్రతకలేని జీవితం జీవితమే కాదనిపించేంత డీప్‌గా ఫీలయిన మన ప్రేమా..ఇవన్నీ నాకు గుర్తున్నాయి ఆనంద్!" అంది.

"నిజంగా..నిజంగా నీకు అవన్నీ గుర్తున్నాయా కస్తూరీ?" ఉద్వేగంగా అన్నాడు ఆనందరావు.

ముప్ఫయ్యేళ్ల తర్వాత తామిద్దరూ తిరిగి కలుసుకున్న ఈ సందర్భంలో గతాన్నీ, గతంలోని తమ ప్రేమ గురించీ ప్రస్తావించడం సంస్కారం కాదనీ, ఒకవేళ తాను ప్రస్తావనకి తెచ్చినా స్త్రీ కాబట్టి ఆమె గిల్టీగా ఫీలవుతుందేమోనన్న భావంతో అప్పటివరకూ మనసులోనే అణచి పెట్టుకున్న అతడి ఉద్వేగం ఆమె నోటినుంచే ఆ ప్రస్తావన రావడంతో ఆ విధంగా బయటపడింది.

## చిగురించిన చెలిమి

**సల్మాన్‌ఖాన్‌తో వచ్చిన గొడవల మూలంగా 'సలామ్-ఎ-ఇష్క్' సినిమా తర్వాత అతనితో కలిసి ప్రియాంక చోప్రా నటించలేదు. మళ్లీ ఇప్పటికి ఆ గొడవలు సద్దుమణిగినట్టున్నాయి. ఇద్దరూ కొత్తగా 'వీర్' అనే సినిమాలో నటిస్తున్నారిప్పుడు. దీనికి కథను సల్మాన్ ఖాన్ స్వయంగా సమకూరుస్తున్నాడు. రాజకీయాల్లోనే కాదు సినిమా ఇండస్ట్రీలోనూ శాశ్వత శత్రువులూ శాశ్వత మిత్రులూ వుండరు కదా!**



"అదేంటీ..అలా అడుగుతావ్? ఎందుకు గుర్తుండవ్? ఒకర్నొకరం ఎంత గాఢంగా ప్రేమించుకున్నామో, మన పెళ్ళి గురించీ, మన భావి జీవితం గురించీ ఎన్ని కలలు కన్నామో, మన భవిష్యత్తు కోసం ఎన్నెన్ని ప్రణాళికలు వేసుకున్నామో, ఎన్ని బాసలు చేసుకున్నామో...అన్నీ నాకు గుర్తున్నాయి ఆనంద్! మన పెద్దవాళ్ళు మనల్ని బలవంతంగా వేరుచేశారు కాని, అన్నీ మనం అనుకున్నట్లుగానే జరిగుంటే ఈరోజు మనం భార్యాభర్తలుగా ఉండేవాళ్ళం. ఇవేవీ నీకు గుర్తులేవా? గుర్తురావడం లేదా?" ఆశ్చర్యంగా అడిగిందామె.

"అలాంటిదేం లేదు. అసలు నేను మర్చిపోతేగా..గుర్తులేకపోవడానికీ, గుర్తురావడానికీ?! నిజానికి అవి నా జీవితంలో మరపురాని రోజులు!" ఉత్సాహంగా అన్నాడు. ఇన్నేళ్లు గడిచినా గతం తాలూకు జ్ఞాపకాల్ని తనలాగే ఆమె కూడా మదిలో పదిలంగా దాచుకుందన్న విషయం తెలీగానే అతడికెంతో తృప్తిగా అనిపించింది. ఆమె ఇచ్చిన చాక్లెట్ కూడా అపురూపంగా కనిపించింది.

సాయంత్రం వెలుగులు కనుమరుగై చీకటి

ముసుర్లు కమ్ముకుంటున్నాయి ఆకాశంలో. లేచి లైటు స్విచ్ వేశాడు ఆనందరావు.

"ఇంకా చెప్పు కస్తూరీ" అన్నాడు.

"ఏం చెప్పను?" అడిగిందామె.

"అదే..ఆరోజుల్లోని విషయాలు! మన గురించిన సంగతులు! అవన్నీ ఇప్పుడు తలచుకుంటూంటే ఎంతో అద్భుతంగా అన్పిస్తాయి కదూ?"

"అవునా! ఏమో..నాకైతే గుర్తొచ్చినప్పుడల్లా సిల్లీగా అన్పిస్తాయి"

"ఏమిటీ?" అన్నాడు తను పొరపాటుగా విన్నానేమోనని.

"అవును ఆనంద్! ఆవేశమే తప్ప ఆలోచన లేని ఆ రోజుల్నీ, జీవితం గురించీ, సమాజం గురించీ సరైన అవగాహన లేని ఆ యుక్తవయసునీ తలచుకుంటూంటే ఎంతో సిల్లీగా అన్పిస్తూంటుంది. ప్రేమే జీవితం..ప్రేమించిన వ్యక్తితో జీవితాన్ని పంచుకోలేని బ్రతుకే శూన్యం, వ్యర్థం అని ఎంత గాఢంగా నమ్మామో గుర్తొస్తుంటే భలే నవ్వొచ్చేది నాకెప్పుడూ!"

"అదేంటి కస్తూరీ..ఆరోజులూ, అప్పటి మన ప్రేమా గుర్తొస్తే నీకిలా అన్పించేదా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును...కాదా మరి? ప్రేమంటే యుక్తవయసులో కలిగే ఒక ఫీలింగ్ మాత్రమేననీ, అదే జీవితం కాదనీ పెళ్ళయ్యాకే అర్థమైంది నాకు. అసలైన జీవితం అంటే...అందరి ఆమోదంతో జరిగిన పెళ్ళితో మొదలై సంసారం, పిల్లలూ, వాళ్ళ పెంపకం, వాళ్ళని అభివృద్ధిలోకి తీసుకురావడం, మన కష్టఫలితాన్ని అభివృద్ధిలోకి వచ్చిన కొడుకుల్లో, కూతుళ్ళల్లో, మనవల్లో చూసుకుంటూ సంతృప్తిగా శేషజీవితం గడపడమేననీ ఇన్నేళ్ళ జీవితంలో నేను తెలుసుకున్న సత్యం! కాబట్టి 'పెళ్ళి'ని సమాజంలో మన స్థాయినీ, హోదానీ పెంచే ఒక 'స్టెప్పింగ్ స్టోన్'గా భావించి అటువైపే అడుగేయాలి కాని, దాన్ని వదులుకొని 'ప్రేమ' కోసమో, మరో ఆకర్షణ కోసమో ఇంకోవైపు వెళ్ళకూడదు కదా! అందుకే 'ప్రేమే జీవితం' అంటూ నమ్మి, పెద్దల్ని ఎదిరించైనా పెళ్ళి చేసుకుందాం!' అని అప్పుడు మనమెంత బలంగా అనుకున్నామో గుర్తొచ్చినప్పుడల్లా ఆరోజుల్లో ఎంత సిల్లీగా, ఫూలిష్‌గా ఆలోచించామా' అని అన్పించేది నాకు" ఊపిరి తీసుకోవడానికన్నట్లుగా ఆగింది కాసేపు.

అయితే...ఒకప్పుడు తనని గాఢంగా ప్రేమించి, 'నీకు దూరమైతే నాకు జీవితమే లేదు' అన్న కస్తూరేనా ఇలా మాట్లాడ్తోంది అనుకుంటూ నమ్మలేనట్లుగా చూస్తూండిపోయాడతడు.

"అంతెందుకు ఆనంద్..మన ప్రేమని మన తల్లిదండ్రులు అంగీకరించనందుకు మనమెంత బాధపడ్డామో గుర్తుంది కదూ నీకు? కానీ, మా అబ్బాయిలిద్దరూ తమ ప్రేమ విషయం నాకు చెప్పినప్పుడు తల్లిగా నేను మాత్రం వాళ్ళ ప్రేమలను ఒప్పుకున్నానా? లేదు. కాకపోతే 'ప్రేమే జీవితం కాదు' అంటూ వాళ్ళకి నచ్చజెప్పి సమాజంలో వారి స్థాయినీ, హోదానీ పెంచే సంబంధాలను చూసి పెళ్ళిచేశాం. ఇప్పుడు ఇద్దరబ్బాయిలూ సుఖంగా సంసారాలు చేసుకుంటున్నారు. ఇదే జీవితం!"

కస్తూరి కళ్ళలో తొణికిసలాడ్తున్న తృప్తిని చూస్తూ మౌనంగా ఉండిపోయాడు ఆనందరావు.

"అవునూ...నేనే మాట్లాడుతున్నాను. నువ్వేం మాట్లాడ్డం లేదేంటి ఆనంద్?" అంది కస్తూరి.

వెంటనే ఏమీ బదులివ్వలేకపోయాడతడు. కాసేపయ్యాక మనసులోని భావాల్ని కూడగట్టుకుంటున్నట్లుగా అన్నాడు. "ఏం మాట్లాడమంటావు కస్తూరీ! నీ గురించిన ప్రతీ విషయం ఈరోజుకీ నాకెంతో అద్భుతంగా, అపురూపంగా అన్పిస్తుంది. ఆరోజుల్లోని మన ప్రేమా, మనం కలుస్తున్న సందర్భాలూ, సంఘటనలూ, చెప్పుకున్న మాటలూ, చేసుకున్న బాసలూ..అన్నీ, అన్నీ అంతే స్వచ్ఛంగా, అంతే తాజాగా ఇపపటికీ నా మదిలో పదిలంగా ఉన్నాయి. నీతో గడిపిన ప్రతీ క్షణాన్ని నేను అపురూపమైన తీపి



గుర్తుగా మనసులో భద్రంగా దాచుకున్నాను. కానీ అవన్నీ నీకిప్పుడు సిల్లీగా, ఫూలిష్‌గా అన్పిస్తున్నాయని తెలిసాక ఏం మాట్లాడాలో నాకు తెలీడం లేదు"

కొద్దిసేపు ఆమె మౌనంగా ఉండిపోయింది.

ఆ తర్వాత ఉన్నట్లుండి అడిగింది.."ఆనంద్! ఇలా అడుగుతున్నందుకు ఏమీ అనుకోకు..మీ ఆవిడ పట్ల నీకేమైనా అసంతృప్తి ఉందా?"

"ఛ! అలాంటిదేం లేదు" వెంటనే బదులిచ్చాడతడు.

"నా ఊపిరిని సైతం అనువదించగల అనుకూలవతి నా భార్య! ప్రతీ కష్టం తర్వాత భగవంతుడు అంతకురెట్టింపు సుఖాన్నిస్తాడంటారు..ప్రేమించిన వ్యక్తిని పొందలేకపోయానన్న బాధలో ఉన్న నన్ను ఆ భగవంతుడు నా భార్య రూపంలో అనుగ్రహించాడేమో! ఈనాడు నేనూ, నా కుటుంబం ఇంతటి సుఖసంతోషాలతో ఉన్నామంటే దానికి ముఖ్యకారణం నా భార్యే!" చాలా గర్వంగా చెప్పాడు.

"మరి అంత మంచి భార్యని పొంది కూడా ఇంకా నా గురించి ఆలోచించడం" తన సందేహాన్ని అసంపూర్తిగానే వ్యక్తం చేసింది.

"అంటే..భార్య విషయంలో అసంతృప్తి ఉంటేనే గతంలో ప్రేమించిన వ్యక్తిని గుర్తుంచుకోవాలని రూలేమైనా ఉందా?"

"అహ..అలా అని కాదు"

"చూడు కస్తూరీ! చిన్నప్పుడు పుస్తకాల సంచీ భుజానికి తగిలించుకుని ప్రతిరోజూ కాలువ గట్టు వెంబడి స్నేహితులతో కలసి నడుస్తూ స్కూలుకి వెళ్లటం ఒక చక్కటి అనుభూతిగా ఇప్పటికీ నా మనసులో నిలిచివుంది. హైస్కూలు రోజుల్లో కూడా నా ఈడు ఆడ, మగపిల్లల్తో రాత్రివేళల్లో దాగుడుమూతలు ఆడుకునేవాణ్ణి. అలాంటి సందర్భాల్లో ఎన్నోసార్లు ఆడపిల్లలు హత్తుకుంటున్నా ఎంతసేపు దొరికిపోకుండా దాక్కోవా

## దీపిక ప్రేమాయణం

**యువరాజ్‌సింగ్, ధోనీలతో ప్రేమాయణాల ద్వారా పాపులర్ అయిన బాలీవుడ్ భామ దీపికా పదుకొనే తాజాగా యువ హీరో, రిషీకపూర్ కొడుకూ అయిన రణబీర్ కపూర్‌తో పీకల్లోతు ప్రేమలో పడింది అనేది చర్చ అయింది. దీని గురించి దీపిక పదుకొనే చెప్పకనే చెప్పడం అన్నట్టు- నాకు అస్సలు ప్రేమ గీమా అనేది తెలీని సమయంలో క్రికెటర్లతో ప్రేమాయణాల పుకార్లు పుట్టాయి. కానీ నిజంగా తొలిసారిగా రణబీర్‌తో నేను ప్రేమలో పడ్డాను. ప్రస్తుతం మేం మా సినీకెరీర్‌లు మలుచుకుంటూనే ఒకరినొకరం అర్థం చేసుకుంటున్నాం' అని ఎంచక్కా చెప్పేసింది. ఇది కూడా పబ్లిసిటీయే కాదు కదా!**

లన్న ధ్యాసే తప్ప ఎదుటి వ్యక్తి స్త్రీ అనీ, నేను పురుషుడ్ననీ జ్ఞప్తికే వచ్చేది కాదు. కలుషితం కాని స్వచ్ఛమైన మనసు కలిగిన ఆ చిన్ననాటి సంఘటనలూ, సందర్భాలూ ఈరోజుకీ నాకు గుర్తున్నాయి. తలపుకి వస్తుంటాయి. అలాగే కాలేజీ రోజుల్లో నీ పరిచయం, నీతో స్నేహం, మన ప్రేమా, నీతో గడిపిన సందర్భాలూ, సంఘటనలూ...అంతే భద్రంగా, అపురూపంగా నా మనసులో ఇప్పటికీ తాజాగా వున్నాయి. అవి గుర్తొచ్చినప్పుడల్లా వాటిని తలచుకున్నప్పుడల్లా 'మరపురాని, మళ్లీరాని ఎలాంటి బంగారురోజులే కదా!' అని అన్పిస్తుందే తప్ప ఆ సందర్భాలూ, సంఘటనలూ, అప్పటి నా మానసిక స్థితీ నాకెప్పుడూ సిల్లీగానూ, ఫూలిష్‌గానూ అన్పించలేదు కస్తూరీ!"

తన మాటలు ఆమె వింటోందో లేదో కూడా పట్టించుకోకుండా ఏదో మరో లోకాన్ని చూస్తూ వర్ణిస్తున్నట్లుగా చెప్పసాగాడతను. "ఆడా మగా తేడా తెలీని స్వచ్ఛమైన మనసుతో దాగుడుమూతలాడాలనీ, ఊరి మధ్యనున్న రచ్చబండ దగ్గర చీకటి ముసురుకుంటున్నా స్నేహితుల్తో కలిసి గోళీలాట ఆడాలనీ, రాములవారి గుడి ఆవరణలో రాత్రిళ్ళు వెన్నెల్లో వెల్లకిలా పడుకుని ఆకాశంలోని చుక్కల్ని లెక్కపెట్టాలనీ, హనుమంతుడి కోవెల ప్రక్కనున్న కాలువలో అలసిపోయేదాకా ఈదాలనీ, నిద్రపోతున్న నాన్నకి చెప్పకుండా తీసుకెళ్లిన సైకిల్ని పంచర్‌తో తీసుకొచ్చి నా తండ్రి దగ్గర దెబ్బలు తినాలనీ, చెప్పా పెట్టకుండా చచ్చిపోయిన నా ప్రాణమిత్రుడు శంకరంగాడితో కలిసి వేరుశెనక్కాయల చేనుల్లో పడి తిరగాలనీ...మహా కోరికగా అన్పిస్తుంటుంది ఒక్కోసారి. అంతలోనే 'అవన్నీ ఈ జన్మలో మళ్లీ సాధ్యపడవు కదా..' అని దిగులేస్తుంది"

కళ్ళలోని తేమ ఆరిపోవడానికో, వణికే గొంతు తేరుకోవడానికో..కాసేపు ఆగాడు.

"ఇవే కాదు కస్తూరీ..నీ గురించిన జ్ఞాపకాలు కూడా ప్రతి ఒక్కటీ నాలో ఇంతే గాఢంగా ఇంతే స్వచ్ఛంగా ఉన్నాయి. నీ జ్ఞాపకం మనసులో మెదిలిన ప్రతిసారీ 'నా గురించి కూడా నువ్విలాగే ఆలోచిస్తూ ఉంటావేమో' అనుకునే వాణ్ణి. 'ఒకర్నొకరం ఇంత గాఢంగా ప్రేమించుకొని కూడా జీవితంలో ఒక్కటి కాలేకపోయామే..' అన్న భావన నన్ను బాధపెట్టేది. కానీ ఇన్నాళ్లకి నిన్ను కలిసి, నీ మాటలు విన్న తర్వాత.." అని కొంచెం ఆగి "నీకు నా మనసులో అవసరానికి మించి ప్రాముఖ్యత ఇచ్చానేమోననిపిస్తోంది!" అన్నాడు.

ఆమె ఏమీ మాట్లాడలేదు. చాలాసేపు మౌనం తర్వాత అంది.

"రాత్రి పది గంటలవుతోంది. భోంచేసి పడుకుందామా?"

"అలాగే" నన్నట్లుగా తలూపాడతను.

భోజనాలు ముగించి, ఎవరి బెర్త్ మీదకి వాళ్ళు చేరుకుంటూండగా చెప్పాడు ఆనందరావు.

"అన్నట్టు కస్తూరీ...నా ఇద్దరబ్బాయిలకి మాత్రమే కాదు. నా కూతురికి కూడా సమాజంలో స్థాయీ, హోదాలను పెంచే సంబంధాలొచ్చినా వాటిని కాదని వాళ్ళు కోరుకున్న వారితోనే పెళ్ళిళ్ళు జరిపించాను. అందరూ సుఖంగా, సంతోషంగా కాపురాలు చేసుకుంటున్నారు"

"ఓహో...అలాగా!" అంటూ తల పంకించింది.

"ఓ.కె.కస్తూరీ..గుడ్‌నైట్!" అటు తిరిగి పడుకుంటూ అన్నాడు ఆనందరావు.

"గుడ్‌నైట్!" అంటూ తను దుప్పటి కప్పేసుకుంది.

కానీ ఆలోచనలు మాత్రం ఆమెను చాలాసేపు నిద్రపోనివ్వలేదు.

ooo

"అమ్మా..మీరిక్కడే నిల్చోండి! నేను పార్కింగ్‌లోంచి కారు తీసుకొస్తా!"

మర్నాడు ఉదయం వైజాగ్‌లో రైలు దిగిన తల్లిని రిసీవ్ చేసుకోవడానికొచ్చిన వేణు- కస్తూరినీ, ఆనందరావునీ స్టేషన్ బయట తీసుకొచ్చాక, వాళ్ళను ఓ పక్కగా నిలబెట్టి కారు తీసుకురావడానికి వెళ్లాడు.

"ఓ.కే.కస్తూరీ! నేనిక బయల్దేరుతాను" అన్నాడు ఆనందరావు.

"అదేంటీ? అబ్బాయి కారు తీసుకురావడానికి వెళ్లాడు కదా..అందరం కలిసే వెళదాం. నిన్ను మీ ఇంటి దగ్గర డ్రాప్ చేస్తాం!"

"ఒద్దులే కస్తూరీ..మీ దారి వేరు. నా దారి వేరు! నేను ఆటోలో వెళ్లిపోతాలే! ఓ.కె.బై!"

"ఆనంద్"

ఆగి 'ఏమి'టన్నట్లుగా చూశాడామె వంక.

"ఇన్నేళ్ల తర్వాత కలిసాం. నా అడ్రస్ తెలుసుకోవాలనీ నీ అడ్రస్ నాకివ్వాలనీ గుర్తురాలేదా?"

"గుర్తురాక కాదు..అవసరం లేదనిపించింది!"

"అంటే?"

నవ్వుతూ చూశాడామె వంక. "సింపుల్‌గా చెప్పాలంటే..నీకంటే నా మనసులో ఉన్న నీ జ్ఞాపకమే నాకెంతో అపురూపంగా అన్పిస్తోందిప్పుడు! అంతేకాదు 'నిన్ను కోల్పోయానే' అన్న బాధ కూడా నాకు ఇకముందు కలగదు. ఓ.కె.వెళ్తాను మరి, బై!"

అతడు వెళ్తున్న వైపే చూస్తూ ఉండిపోయింది కస్తూరి.

ఆ క్షణంలో ఆమె మనసులో మెదిలే భావాన్ని మాటల్లోకి అనువదిస్తే అది ఇలా ఉంటుంది..

"ఆనంద్! మనసులోని భావాలను బయటకు వ్యక్తం చేయడమే ప్రేమ కాదు. కొన్ని కొన్ని సందర్భాల్లో వ్యక్తం చేయకపోవడం కూడా ప్రేమే! ఏది ఏమైనా..ముప్పయ్యేళ్ల తర్వాత వచ్చిన ఈ చిన్న అవకాశం ద్వారా నా కారణంగా నీకు ఇకమీదట ఏం కొంచెం బాధ కూడా కలగకుండా చేయగలిగాను. నాకంతే చాలు!"

## క్రేజీ కాంబినేషన్

సిద్ధార్థకి యూత్‌లో మంచి ఫాలోయింగ్ వుంది. అలాగే 'హ్యాపీడేస్'తో తనదైన గుర్తింపు తెచ్చుకుంది యువతార తమన్నా. ఈ ఇద్దరూ జంటగా నటిస్తే ఇక ఆ సినిమాకి క్రేజ్ ఎంత వస్తుందో వేరే చెప్పాలా? తాజాగా ఈ ఇద్దరూ జంటగా 'కొంచెం ఇష్టంగా.. కొంచెం కారంగా' అనే సినిమా నిర్మాణమవుతోంది. కిశోర్ అనే కొత్త దర్శకుడు రూపొందిస్తున్న ఈ సినిమా ఎలాంటి విజయం సాధిస్తుందో అని అప్పుడే అంచనాలు మొదలవుతున్నాయి.

